
# సంగమం

ఆదూరి వెంకటసీతారామమూర్తి



డాబా మీద నిల్చుని ఆకాశంవంక చూశారు రాఘవరావుగారు—మేఘాలు ఒకటే ఒకటే పడమటినించి ఉత్తరం దిశగా పోతున్నాయి—పగటి వెలుగు తగ్గిపోటానికి యిక కాస్సేపే వ్యవధి వుంది. ఆ కాస్త వెలుగూ పోయి ఏ గాలో తోడైతే మేఘాలు వర్షించి వాతావరణం పూర్తిగా మారిపోతుంది—

ప్రకృతి ఎంతలో మారిపోవాలి ?

తూర్పుదిశన దూరంగా కొండవారగా వురకలేస్తూ కన్పిస్తోంది సముద్రం.

నింగికీ నేలకూ మధ్య గాలిలో గిరికీలు కొడుతోందో పక్షి.

ఆ పక్షితో తనను పోల్చుకున్నాడు రాఘవరావు. తన పరిస్థితీ అలానే వుంది — అంటూ అసంతృప్తిగా నిట్టూర్చేడు.

భాస్కరం అలాంటి నిర్ణయం తీసుకుంటాడని ఆయన ఏనాడూ వూహించనైనా వూహించలేదు. పిల్లలందరిమీదా ఒకే రకమైన ప్రేమ వున్నా భాస్కరమంటే తనకదోరకమైన ప్రత్యేకమైన అభిమానం. చిన్నతనం నుండీ డిగ్రీ పూర్తి చేసేవరకూ భాస్కరం కూడ తనమాట జవదాటలేదు. తన అభిప్రాయాలకు అనుగుణంగానే నడుచుకుంటూ వచ్చాడు.

'ఈ పరిస్థితి యిలా వుంది నాన్నగారూ ఏం చెయ్యమంటారు' అని అడిగేవాడు—తను చెప్పిందే వేదవాక్కుగా స్వీకరించేవాడు.

అటువంటిది వాడి స్వవిషయంలో—పెళ్ళి తన స్వవిషయమని అనుకున్నాడు కాబోలు... తన అభిప్రాయం అనవసరమనుకున్నాడు.

ఐతే—నేటి యువతరం ప్రతినిధిలా పెళ్ళి చేసుకొచ్చి కాళ్ళమీదపడి దీవించరండి నాన్నారూ అనలేదు—అలా చేసినా తనింత బాధపడేవాడే కాదు—కరుకుగానో, సౌమ్యంగానో పరిస్థితిని దిద్దుకునేవాడు.

'నేను వసుధను ప్రేమించాను నాన్నగారూ. పెళ్ళికూడ చేసుకోవాలనుకుంటున్నాను — ఆమె కులమూ, ఆర్థిక స్థితిగతులూ నా కనవసరమనుకున్నాను — ఈ విషయంలో మీ అనుమతి తీసుకోకపోయినా తప్పటడుగు మాత్రం వేయటం లేదు. మీరు అర్థం చేసుకుని మమ్మల్ని దీవిస్తే నాకంటె అదృష్టవంతుడుండడు.'' అంటూ ఓ శుభముహూర్తాన భాస్కరం తన నిశ్చయాన్ని వెల్లడిచేసే సరికి నోటమాటరాలేదు తనకు. భారతమ్మ సంగతి సరేసరి— కళ్ళంట నీళ్ళే తక్కువయ్యాయి—

ఆ తర్వాత మాటలూ, అర్థింపులూ, ఏడ్పులూ... ఎన్ని ఏమైతేనేం ? భాస్కరం తన మాటమీదే నిలబడిపోయాడు – పెళ్ళంటూ చేసుకుంటే నేను వసుధనే చేసుకుంటాను. కానీ మీ ఆశీర్వాదం లేనిదే పెళ్ళి చేసుకోను— అంటూ భీష్మించుకుని కూర్చున్నాడు.

''ఇదో కొత్తరకమైన శిక్ష'' నిట్టూర్చారు రాఘవరావుగారు.

ఆకాశంలో నల్లమేఘాల స్థానే తెల్ల మేఘాలు చోటుచేసుకుంటున్నాయి— దూరంగా వున్న ఖాళీస్థలంలో ఆడపిల్లలంతా ఏవేవో ఆటలాడుకుంటున్నారు—

అనుకోకుండా రాఘవరావుగారి దృష్టి మూడోయింటి డాబామీద పడింది – బంగారు వన్నె శరీరమేమో... నారింజరంగు చీరలో మెరిసి పోతోందామె. పమిటను నిండా కప్పుకుని పిల్లల ఆటల్ని చూస్తోంది.

సృష్టి ఎంత విచిత్రం ? ఒక్కోమనిషిలో ఎన్నో అందాలు ! ఒక్కో మనిషిలో ఎంతవెదికినా యే అందాలూ కానరావు.

వాళ్ళా ఇంట్లోదిగి నెలరోజులౌతుందేమో... ఆమె మాత్రం ఏ నాలుగుమార్లో కన్పించిందంతే. సుమారు నలభై ఏళ్ళుంటాయామెకు— కానీ ముప్పయి అయిదేళ్ళ దానిలా కన్పిస్తుంది. అంత అందమైన ఆమె భర్త ఎంత అదృష్టవంతుడో! మరెంత అందగాడో అన్పించింది. తీరా,ఆయనను చూశాక కాకిముక్కుకు దొండపండే అన్పించింది. చామనఛాయలో పొట్టిగా వుంటాడామె భర్త. ఓ చిన్నసైజు బానపొట్ట; నెత్తిమీద మండువాలా బట్టతల;ఉన్నకాస్తంత జుట్టైనా తైలసంస్కారం లేకుండా; ఈ ప్రపంచంతోనే సంబంధం లేనట్టు నైరాశ్యపు చూపులతో ఉంటాడు. ఒకరు మాట్లాడితే తప్ప తనంతట తాను కల్పించుకుని మాట్లాడే వ్యక్తిలా కన్పించడు ఆమెను కూడా

# సంగమం

యింతవరకూ యిరుగు పొరుగులతో నైనా మాట్లాడగా ఎవరూ చూళ్ళేదు. గుట్టైన; గుంభనమైన సంసారంగా పేరు పొందింది వారి సంసారం ఈ కొద్దిరోజుల్లోనే.

రాఘవరావుగారి దృష్టి మళ్ళీ ఆకాశంమీదికే మళ్ళింది. ఆకాశం నిర్మలంగా వింత వెలుగుతో వుంది. బారులు బారులుగా పక్షులు ఎగురుతున్నాయి.

జంటలుగా ఏర్పడి మనుగడసాగించడానికి సృష్టి అట్లా జరిగిందా ? పెళ్ళిళ్ళు స్వర్గం లోనే ముందుగా జరుగుతాయి అన్నది ఆంగ్ల నానుడి. ఆమె పట్ల అది నిజమే అన్పిస్తుంది. లేకపోతే ఏమిటి ? అపురూప సౌందర్యరాశి అని మన పూర్వులు వర్ణించినట్లుండే ఆమె ఎక్కడ. కనీస ఆకర్షణకూడ లేని కురూపిలాంటి ఆయనెక్కడ? వీరిద్దరికీ పెళ్ళి ఎట్లా జరిగింది? ఇరవైయేళ్ళక్రితం స్త్రీకి నేడున్నంత స్వేచ్ఛ తన పెళ్ళి విషయంలో వుండేదికాదు — ఆ కారణంవల్లనే పెద్దల మాటలకు తలవంచి ఆమె అతడిని చేసుకుందా ? అదే నిజమైతే ఎంత రాక్షసత్వం వుందీ మనుషులలో ! ఎంత బుద్ధి హీనులు ఆ పెళ్ళి చేసిన పెద్దలు ! క్రూర సింహం ముందుకు లేడిపిల్లను తోసి ఆనందించ గల నేర్పు యీ మానవులకే వుందేమో ! కుంద నవు బొమ్మలాంటి అమ్మాయిని ఆస్తికోసమో; చిన్నతనంలో అనుకున్న మాటకోసమో యిష్టం లేనివాడికిచ్చి కట్టబెట్టడం, ఒక జీవితానికి సరిపోయే శిక్షను వేయడం ఎంత అమానుషం ?

రాఘవరావుగారి దృష్టి రోడ్డు మీద సైకిల్ తొక్కుతూ పోతున్న అమ్మాయిపై పడింది — పన్నెండేళ్ళుంటాయేమో... తెల్లగా అందంగా సుకుమారంగా వుంది. ఆ సైకిలు ఆ యింటిముందు ఆగేకగాని గుర్తురాలేదు రాఘవరావుగార్కి ఆ అమ్మాయి వాళ్ళ అమ్మాయే అని — వసంత చూపిస్తే ఓ మారు చూశాడు. చక్రాల్లాంటి కళ్ళు... అచ్చం తల్లి పోలికతోనే వుంటుంది — అంతకంటే పెద్దవాడు డిగ్రీ చదువుతున్నాడట - అతగాడివన్నీ తండ్రిపోలికలే. అయినా బుద్ధులు మంచివి రావాలిగాని పోలికల్లో యేముందీ - పండిత పుత్రుడు శుంఠ అవొచ్చు— పాలేరు కొడుకు కలక్టరు కావొచ్చు.

"నాన్నా — అమ్మ పిలుస్తోంది", అంటూ వచ్చింది వసంత మౌనంగా. వసంత వెనుకే దిగి పోయారు రాఘవరావుగారు — సంధ్యావందనం చేస్తున్నా, ఆ తర్వాత భోంచేస్తూన్నా ఆయన ఆలోచిస్తూనే వున్నారు.

భాస్కరం పుట్టిన నాలుగేళ్ళకు పుట్టింది వసంత. ఆ తర్వాత మరో మూడేళ్ళకు చైతన్య— అంతే ! ఆ తర్వాత యింక పిల్లలు కలగలేదు.

ముగ్గురి పిల్లల్నీ ముచ్చటగా పెంచాలను


రు. Rs. 40,500 విలువ చేసే
బహుమతులు గెలవండి



మొదటి బహుమతి ●
రాజదూత్ మోటార్ సైకిల్ లేదా రు. 9000/- నగదు.

రెండవ బహుమతి
టూ-ఇన్-ఒన్ స్టీరియో లేదా రు. 4000/- నగదు.



110 కన్సొలేషన్ బహుమతులు
(1) ఏ-ఒన్ మిక్సర్ గ్రైండర్, తగ్గింపు ధర రు. 265/- లేదా
(2) ఆల్ వరల్డ్ ట్రాన్సిస్టర్ రు. 180/- లేదా
(3) అమెరికన్ డిజైన్ చీర రు. 80/- విలువ చేసేది.



ఈ ప్రకటన ధ్యేయం అమ్మకాలను పెంచటం
ఈ క్రింది మూడు వరుసల్లో, ఏ ప్రక్కనుంచి కూడినా 60 వచ్చే విధంగా 16 నుంచి 24 వరకే అంకెలను వాడాము.
19+24+16=60 ఉదాహరణకి
18 20 22
23 16 21
మీరు చేయవలసిందల్లా : ఇదే విధంగా ఎటు చూసినా 66 వచ్చే విధంగా, మూడు వరుసల్లో 18 నుంచి 26 వరకూ అంకెలను వాడాలి.
**నిబంధనలు :** ఒక కుటుంబం నుంచి ఒకే ఒక ఎంట్రీ మాత్రమే అంగీకరిస్తాం. ఫలితాలు తెలవగానే విజేతలకు తెలియబరుస్తాం. యాజమాన్యం వారిది తుది నిర్ణయం. మీ ఎంట్రీలను 10 రోజుల్లో పంపండి. మీ చిరునామాను ఇంగ్లీషులో గాని, హిందీలో గాని మాత్రమే వ్రాయండి.
VESPA ELECTRONICS C/57 Old Double Storey Delhi-110024



ఆపరేషను, ఇతర వైద్య చికిత్సలతో నిరాశచెందిన సోదర, సోదరీ మణులు అనేకులు మా సలహాలచే సంతానవంతులయి ఇచ్చిన యోగ్యతాపత్రములు గలవు.

మీకు బేబి/బాబు కావాలా



స్త్రీ, పురుష వంధ్యాదోష నివారణా నిపుణులు.
వివరములు ఉచితం
పోస్టు ద్వారా చికిత్స గలదు.. ఈ మాస ములో స్వయముగా సంప్రదించుటకు

— తెనాలి —
గురువారం, ఆదివారం — మధ్యాహ్నం.. గం. 12-00 నుండి సాయంత్రం.. గం. 5-00 వరకు

— విజయవాడ —
మంగళవారం, బుధవారం, శనివారం — మధ్యాహ్నం.. గం. 12-00 నుండి సాయంత్రం.. గం. 5-00 వరకు

శ్రీనాగార్జున మూలికా కుటీరం
రైల్వేస్టేషన్‌వద్ద., రామాలయంవీధి, తెనాలి. 522 202.. * 2వ లైను, కేదారేశ్వరపేట, విజయవాడ. 520 003..

కున్నారు రాఘవరావుగారు — వారికి మంచి భవిష్యత్తును ఏర్పరచాలని ఆశపడ్డాడు — కానీ మధ్యతరగతి మనిషి ఆశలపల్లకిలో వూరేగుతాడే తప్ప ఆర్థికపరమైన అవరోధాలను దాటి యివతల పడలేడన్న సత్యం కాస్త ఆలస్యంగానే అవగతమైంది రాఘవరావుగారికి — ఇంజనీరు అవాల్సిన భాస్కరం డిగ్రీ అయిందనిపించి గుమస్తాగిరీలో చేరాడు. సంగీతంలో అపర సరస్వతి కావల్సిన వసంత డబ్బులేని కారణంగా సంగీతాన్ని గీతాలతోనూ, చదువును పదో తరగతి తోనూ ఆపేసి తల్లిదండ్రుల నిర్ణయాలకు తలవొగ్గి యింట్లో కూర్చుంది.

అప్పటికే కూడబెట్టినదంతా హరించుకు పోగా అయిదువేల అప్పు మిగిలితే యిక చైతన్య చదువు గురించి బెంగ పట్టుకుంది రాఘవరావు గారికి.

కానీ చైతన్య చదువు అనుకున్నంత యిబ్బందిని కలిగించకపోగా అనుకోని అదృష్టాన్నే తెచ్చిపెట్టింది. ఎప్పుడూ నీర్సంగా చదువులో ఏవరేజ్‌గా వుండే చైతన్య టెంత్ క్లాసు ఫస్టు క్లాసులో పాసయ్యాడు. పై చదువులకై గవర్నమెంటు స్కాలర్‌షిప్ సంపాదించుకున్నాడు.

మళ్ళీ పిల్లల భవిష్యత్తు గురించి ఆశలు చిగురులు తొడిగాయి రాఘవరావుగారి మనసులో. కొడుకు లిద్దరూ ఆర్థికంగా తనకు సాయపడితే వసంత పెళ్ళి కాస్త ఘనంగానే జరిపించగలడన్న నమ్మకమేర్పడింది. మధ్యతరగతి యిబ్బందులలో పెరిగి పెద్దవారైన పిల్లలే రేపు అనుభవశాలులై జీవితాల్ని అర్థంచేసుకుని ఎదుటి జీవితాల్ని దిద్దగలిగే స్థితికి చేరుకోగలరని రాఘవరావుగారి నమ్మిక.

కానీ... ఆ నమ్మకాల్ని వమ్ముచేసేలా భాస్కరం ప్రవర్తించబోవడం రాఘవరావుగారి గుండెను పిండినట్లే అయింది. తన పెళ్ళి విషయం తానే ఆలోచించుకుని నిర్ణయించుకున్న భాస్కరం రేపు తనకు ఆర్థికంగా ఎలా సాయపడ గలడన్నదే సందేహం.

భారంగా నిట్టూర్చేరు రాఘవరావుగారు. తన పిల్లలు తను అనుకున్నంత ఉత్తములూ, తెలివైనవాళ్ళూ కాకపోవచ్చు, కానీ కన్నవారికి కూడా ఉపయోగపడని పనికిమాలినవాళ్ళూ, స్వార్థపరులూ కాలేరన్నది మాత్రం నిజం — ఆ నమ్మకం తనకు తను వారికి పెంచిన పెంపకం కలిగించింది. ఆలోచిస్తే భాస్కరం చేసిన దాంట్లో తప్పేముంది? తన యిష్టాన్ని ప్రకటించి తమ అంగీకారాన్ని కోరేడు — ఆ మాటకొస్తే భాస్కరం పెళ్ళిద్వారా తను తన కూతురి పెళ్ళికోసం వెనకెయ్యాలనుకున్న ఆలోచనే తప్పు.

ఆలోచనలతో ఎప్పుడో నిద్రపట్టింది రాఘవరావుగారికి.

* * *

తెల్లారింది. బాధ్యతల సంసార చక్రం బరువుగా కదిలింది. చిన్నకొడుకు చైతన్యతో పాటు బస్టాపులో నిల్చున్న రాఘవరావుగారి ఆలోచనలు పరిపరివిధాల వున్నాయి. ఇంటర్ ఫస్టుక్లాసులోనూ; టెక్నాలజీ ఎంట్రెన్సు మంచి మార్కులతోనూ పాసైన చైతన్యకు యూనివర్శిటీలో సీటు వస్తుందో రాదోనన్న సందేహం ఏర్పడుతోంది. ఆ రోజే ఇంటర్‌వ్యూ.

వేళకు బస్సు రాలేదని చైతన్య అసహనంగా తిరుగుతున్నాడు. అతని కాలు ఒకచోట నిలవటం లేదు. కొడుకులోని ఆతృతని గ్రహించిన రాఘవరావుగారు "పోనీ ఆటో చేయించుకుని వెళ్దామేంటిరా" అన్నారు.

"ఎందుకు నాన్నగారూ అదో దండగ - ఈ టెక్నాలజీలో సీటొస్తుందని నాకు నమ్మకం కుదరడంలేదు — తెలివైన వాళ్ళూ; క్లాసులు తెచ్చుకున్నవాళ్ళే చాలమంది టెస్టులో నెగ్గలేదు. ఈ పరీక్షలు తెలివైన వాళ్ళకి సీటివ్వటానికి కాదు. క్లాసులతోనూ, మార్కులతోనూ నిమిత్తం లేకుండా తమకు కావల్సిన వారికిచ్చు కుందికి. అదే అర్థమౌతోంది నాకు. ఇంతోటి యింటర్వ్యూకే ఆటోలూ, టాక్సీలూ ఎందుకూ" చైతన్య చాల వుద్రేకంలో వున్నట్లని పించింది రాఘవరావుగారికి.

"యూనివర్శిటీలో సీటుకోసమా అంకుల్ మీరు వెళ్తుంటా" సన్నని నాజూకైన గొంతు విన్పిస్తే పక్కకు చూశారు రాఘవరావుగారు. అందంగా చక్రాల్లాంటి కళ్ళతో. పన్నెండేళ్ళ ఆ అమ్మాయి — తమ వీధిలో కొత్తగా దిగిన వారమ్మాయి — చైతన్య మాటలు విని కాబోలు చనువుగా వచ్చింది.

"ఏం ? నువ్వు యిప్పించగలవా" అన్నాడు చైతన్య కాస్త చిరాగ్గానే.

"ఊ... మా డాడీ పనిచేసేది అక్కడేగా... నేను చెబితే కాదనరు - తప్పకుండా వస్తుంది సీటు" అంది.

ఆ అమ్మాయి మాటల్లోని అమాయకత్వానికి నవ్వొచ్చింది రాఘవరావుగారికి.

"మీ నాన్నగారేం చేస్తుంటారమ్మా అక్కడ ?" అడిగేడు.

"అసిస్టెంట్ ప్రొఫెసరు...టెక్నాలజీలో"

ఆశ్చర్యంతో రాఘవరావుగారికి నోట మాట రాలేదు— ఏ వ్యవసాయదారుడో వ్యాపారస్థుడో అనుకున్న అందవిహీనమైన ఆ అమ్మాయి తండ్రేనా అంతటి విజ్ఞాని? బాహ్యమైన రూపం చూసి మనిషిని తప్పుగా అంచనా వేసి నందుకు తనను తానే నిందించుకున్నాడు.

"ఆలోచించకండి అంకుల్ మీరు మా వీధిలోనేగా వుండేది. రోజూ చూస్తుంటా మిమ్మల్ని. పేరు రాసివ్వండి. నేను డాడీతో చెబుతాగా" అంటూ యిచ్చేవరకూ వూరుకుంది కాదా అమ్మాయి —


చైతన్య వివరాలు రాసిన కాగితాన్నామెచేతి కందిస్తూ "నీ పేరేమిటమ్మా" అనడిగారు రాఘవరావుగారు.

"పల్లవి."

"మీ నాన్నగారికి సంగీతంలో కూడ ప్రవేశ ముందా."

"ఊహూఁ. మా నాన్నగారికి పుస్తకాలే అన్నీను. ఆయనకది వుంటే అన్నం కూడ అక్కర్లేదు."

"మరి...? మీ అమ్మగారు పాడతారా ?"



# 'లెవల్ క్రాసింగ్'

ఇది లెవల్ క్రాసింగా ?
డెవిల్స్ క్రాసింగా ?

గణగణ డేంజరు గంట మ్రోగుతువుంటే
ఇదే నీ ఆఖరు గంట అని చెపుతూవుంటే
కణకణ డేంజరు లైటు వెలుగుతూవుంటే
ఇదే నీ ఆఖరు మంట అని తెలుపుతూవుంటే
క్రాస్‌బార్ మెడమీద కత్తిలాగ పడుతూవుంటే
చాకల్లే రైలుబండి దూసుకుపోతూవుంటే
ఎందుకు ఈ తొందర ?
ఎక్కడికీ పరుగు ?
ఎందుకు ఈ హడావుడి. దాటిపోవాలని
చావడానికా ? బ్రతకడానికా ?
తెలీదు ఏమీ !

లెవల్ క్రాసింగ్‌నిండా జీవితం
కలకల బిలబిల కదుల్తూవుంటే

అటూ ఇటూ ట్రక్కులు, ఎన్నో కారులు, రిక్షాలో సైకిళ్ళు
ముందొక కారు అడ్డుపడి
ఆగిపోయిందొక బస్సు
బస్సులోని జనం ఆగలేదు ఆవేశంతో ఊగిపోయారు
ప్రక్కల్నించి శూలంవలె దూసుకపోయింది కారు ఒకటి

దేనికేది ఢీకొన్నా
కొన్ని జీవితాలు సున్నా
కొన్ని క్షణాలు ఆగుతె
అంతా మామూలే మళ్ళీ
అయినా ఎందుకీ తొందర ?
ఎక్కడికీ పరుగు ?
చావడానికా ? బ్రతకడానికా ?
తెలీదు ఏమీ !

**— భమిడిపాటి వెంకటరమణ**

పొడరన్నట్లు తలూపి వెళ్ళిపోయింది.

నాలుగురోజుల తర్వాత ఓ సాయంకాలం వచ్చింది పల్లవి రాఘవరావుగారి దగ్గరకు.

"మీ చైతన్యగారికి సీటొచ్చిందట — డాడీ చెప్పమన్నారు."

ఆశ్చర్యంగా నమ్మలేనట్లుగా చూశారామె వంక—నిజానికి ఆరోజు యింటర్వ్యూలో చైతన్య సరిగా చెప్పలేదు. ఖచ్చితంగా సీటు రాదనే నిర్ధారించుకున్నాడు. మరి యిదేమిటి ?

"నిజం అంకుల్—సీటొచ్చిందిట— నే చెప్పలేదూ డాడీ నా మాట కాదనరని"

"థ్యాంక్యూ పల్లవీ థాంక్యూ..." రాఘవరావుగారి కళ్ళలో ఆనందభాష్పాలు విరిశాయి.

## సంగమం

ఆ మర్నాడు చైతన్య నిజంగానే సెలెక్టు అయినట్టు తెల్సింది — పల్లవి తండ్రి గురించి రాఘవరావుగారిలో ఎన్నో ఆలోచనలు చోటు చేసుకున్నాయి. ఆలోచించినకొద్దీ ఆయనపై గౌరవం పెరుగుతూనే వచ్చింది.

* * *

రోజులు గడుస్తున్న కొద్దీ రాఘవరావుగారి గుండెలో ఆవేదన అధికమౌతూనే వచ్చింది. భాస్కరం విషయంలో తనో నిర్ణయానికి రాలేకపోతున్నాడు. అందంలోనూ గుణంలోనూ గొప్పవారైన కోడళ్ళు రావాలని ఆశపడ్డాడు. కోడలు గొప్పదైతే వంశం గొప్పదౌతుందని నమ్మకం. ఆ నమ్మకాలేకాక ఎక్కడో కాస్తంత స్వార్థం... ఆడపిల్ల తండ్రిగా తప్పదేమో మరి !

భాస్కరం పట్టుదల గురించి తనకు బాగా తెల్సు—ఆలోచించకుండా ఏ నిర్ణయాలూ తీసుకోక పోయినా ఒక నిశ్చయానికొస్తే మాత్రం మరొకరి ఆలోచనకు తావివ్వడు. వారం రోజులుగా కొడుకులో వచ్చిన మార్పును గమనిస్తూనే వున్నారాయన. ఇంట్లోవుండే సమయమే తగ్గించేసాడు భాస్కరం. ఏ వేళకోవచ్చి భోంచేస్తాడు. వున్నకాస్సేపూ మాటామంతీ లేకుండానే గడిపేస్తాడు.

ఆ రోజు ఆరుబయట వాలు కుర్చీలో కూర్చొని ఆలోచనలో నిమగ్నమయిన రాఘవరావు గారి దగ్గరకు వసంతవచ్చి చెప్పిన వార్తకు ఆయన నిశ్చేష్టుడయ్యాడు.

"ఏమిటమ్మా నువ్వంటున్నదీ...నిజమే ?"

"అవున్నాన్నగారూ నేనూ నమ్మలేకపోయాను పల్లవి చెబుతుంటే—అంత అందమైన ఆమెకు మాటలు కరువా అన్పించింది."

ఎంతదారుణం ? వాస్తవానికీ వూహకీ ఎంత తేడా ! అపురూప సౌందర్యవతి అనుకున్న ఆమె మూగదా ? అంద విహీనంగా నిర్లిప్తంగా వెర్రివాడులా వుండే ఆయన ఒక విశ్వవిద్యాలయంలో ప్రొఫెసరా ? వారిద్దరి సంగమం ఎంత విచిత్రమైనది !

కనీసావసరమైన మాట లేకపోయినా ఎదుటి వ్యక్తిలోని బాహ్య సౌందర్యంకాక ఆత్మ సౌందర్యాన్ని గుర్తించి జీవిత భాగస్వామిగా చేసుకున్న అతడెంత వున్నతుడు ! మనిషికి కావల్సింది చర్మ సౌందర్యం కాదు. మనో సౌందర్యం. అది గుర్తించి ఒకరినొకరు గౌరవించుకున్ననాడు ఆ దాంపత్యం రెండు శరీరాల కలయిక కానేరదు. రెండు ఆత్మల సంగమమౌతుంది. పవిత్రమైన రెండు మనసుల బంధమౌతుంది.

ఆ రాత్రే భాస్కరం పెళ్ళి విషయంలో ఒక నిర్ణయానికొచ్చారు రాఘవరావుగారు. రాత్రి ఏడున్నరకే భోజనంచేసి తన గదిలోకి పోయి చదువులో నిమగ్నమయ్యే ఆయన కొడుకు రాక కోసం నిరీక్షిస్తూ తొమ్మిది వరకూ ఆరు బయటే కూర్చున్నారు. ఆ తర్వాత అతగాడితోనే భోజనానికి కూర్చుని తన అభిమతాన్ని అంగీకారాన్నీ వ్యక్తం చేశారాయన.

ఆ సమయంలో అటు భార్య భారతమ్మ ముఖంలోనూ, భాస్కరం ముఖంలోనూ వ్యక్తమైన ఆనందం ఆయనకు అపూర్వమనిపించింది. ఒకఇంటి పెద్దగా, యజమానిగా తనకు ఒకరి మనసును బాధించే హక్కెక్కడిది? అనుకున్నాడు.

"నాన్న మనసు నాకు తెలుసమ్మా. నన్నీ స్థితికి తెచ్చిన నాన్నను బాధపెట్టడం నాకూ యిష్టంలేదు. కానీ ఆయనకున్న బరువు బాధ్యతలను కొన్నైనా పంచుకోవాలనే నేనీ నిర్ణయం తీసుకున్నది"— అని ఆరాత్రి భాస్కరం తల్లితో చెప్పడంవిని ఆనందపడిపోయారురాఘవరావుగారు.

"తన పిల్లలు పేదరికమనే బూడిదలో పడి పోయిన మాణిక్యాలు" అనుకున్నారాయన. ఆర్రాత్రి హాయిగా నిద్రపోయారాయన.

* * *

"సాయంకాలం ఓ కొత్తవ్యక్తి మనింటి కొస్తున్నారు. అందరూ యింటిదగ్గరే ఉండండేం" అంటూ ఉదయం ఆఫీసుకెళ్ళే ముందు ఓజనాంతిక ప్రకటన చేశాడు భాస్కరం. భాస్కరంలో కలిగిన మార్పు రాఘవరావుగారు గుర్తించకపోలేదు. అందరితో పాటు ఆయనా విన్నారు కొడుకు మాటల్ని.

"ఇంకెవరై ఉంటారూ. కోడలి పిల్లనే సరాసరి యింటికి తీసుకొచ్చి పరిచయం చేస్తాడు గావును" అనుకున్నారాయన.

ఎవ్వరూ ఏం మాట్లాడక పోవడంచూసి, "అమ్మా వింటున్నావా. వీలైతే కాస్త టిఫిన్ కూడ చెయ్యాలి" అన్నాడు తల్లి నుద్దేశించి.

"అలాగే లేరా. ఇంతకీ ఆ వచ్చేదెవరో చెప్పావు కావు" అన్నారావిడ వంటగదిలోంచి తొంగి చూస్తూ.

చూస్తారుగా!" అంటూ ఎవరో ఏమిటో చెప్పకుండానే వెళ్ళిపోయాడు భాస్కరం.

సాయంకాలం నాలుగయ్యేసర్కి ఇల్లంతా నీటుగా సర్ది గుమ్మాలకు తెరలుకట్టింది వసంత. ఆ తర్వాత స్నానంచేసి వంగపూవు రంగు పరికిణీ, తెల్ల అమెరికన్ జార్జెట్ వోణీ వేసుకుని జడలో ఫల సంపెంగి పెట్టుకుంది. భారతమ్మగారుకూడ ఉప్మాచేసి, ఫిల్టర్ కాఫీ కోసం డికాక్షన్ వేశారు — పనులన్నీ అయ్యాక గుంటూరు జరీ చీర కట్టుకుని గుమ్మంలో చతికిల బడ్డారు — రాఘవరావుగారుకూడ షికారు కెళ్ళడం మానేసి పొందూరు ఖద్దరు పంచ, ఇస్త్రీ లాల్చీ వేసుకుని పక్కింటివారినుంచి తెప్పించుకున్న న్యూస్ పేపర్ చూస్తూ ముందు గదిలో కూర్చున్నారు. ఒక్క చైతన్యకు తప్ప అందరికీ ఒకే ఆతృత. ఆ వస్తున్నది ఎవరా అని. చైతన్య మాత్రం మామూలుగానే కాలేజీనుంచి వచ్చి పుస్తకాలు తీసుకుని డాబామీదికి పోయాడు.

ఐదున్నర అవుతూంటే యింటి ముందు స్కూటర్ ఆగింది —భాస్కరం వెనుకే యింట్లో కొచ్చిన అతన్నిచూసి నిరుత్సాహపడ్డారంతా.

"ఇతను పండరికుమార్ అనీ... నాకు కావల్సినవాడు — ఎం.కామ్. చదివి ప్రస్తుతం బేంకులో పనిచేస్తున్నాడు" అంటూ తల్లికీ తండ్రికీ పరిచయం చేశాడు భాస్కరం.

"చాలా సంతోషం నాయనా!" అంటూనే ఏవేవో ప్రశ్నలు కురిపించారు రాఘవరావుగారు.

ప్లేటులో ఉప్మా, గాజుగ్లాసులో మంచి నీళ్ళూ తెచ్చి బల్లమీద పెట్టింది వసంత.

"మా చెల్లాయి వసంత" అంటూ ఆమెనూ పరిచయం చేశాడు.

"నమస్కారం. ఏం చేస్తున్నారూ" అంటూ నవ్వుతూ అడిగేడు పండరికుమార్. సిగ్గుపడి తలొంచుకుంది వసంత.

"ఏముంది మిడిల్‌క్లాస్ చదువుతో; ఆలోచనలతో గడిపేస్తోంది" అన్నాడు భాస్కరమే ఛలోక్తిగా.

"పో అన్నయ్యా" అంటూ సిగ్గుపడిందామె. ఆ సిగ్గుల మొగ్గలలో అందాల్ని చూశాడు పండరికుమార్.

కాస్సేపు మాట్లాడి అతను వెళ్ళిపోయాక కొడుకును అడిగింది భారతమ్మగారు.

"ఇంతకీ ఆ అబ్బాయి ఎవరంటావ్" అని—

"మీకాబోయే కోడలికి సాక్షాత్తూ అన్న దమ్ముడు — నాకు చిన్ననాటి స్నేహితుడు — ఇంకా... మీరు కావాలనుకుంటే యీ యింటి అల్లుడుకూడ" అని అందరి వంకా చూశాడు భాస్కరం. భారతమ్మగారూ రాఘవరావుగారూ ఆఖరి మాటకు ఆశ్చర్యంగా కొడుకు ముఖంలోకి చూశారు. వసంత మాత్రం సిగ్గుపడి మరో గదిలోకి వెళ్ళిపోయింది.

"మనం కావాలనుకుంటే మాత్రం అయిపోతుందా? అబ్బాయి విశేషంలా వున్నాడు — ఉద్యోగస్తుడూ, మర్యాదస్తుడూను. అతగాడు నచ్చుకోవాలిగా — ఇంతకీ కులమేమిటో ..." అని ఆగిపోయింది భారతమ్మగారు.

"కులానికేముందమ్మా — మనవాళ్ళే —" అని, తండ్రి వంక తిరిగి —

"మీరాలోచించి చెప్పండి నాన్నగారూ. అతనికి మన వసంతను ఎప్పుడో చూపించాను. అతనికి నచ్చింది. కట్నకానుకల ప్రసక్తిలేదు. మీరాలోచించి సరే అంటే ముహూర్తాలు పెట్టు కోవడమే."

రాఘవరావుగారికి మనసంతా ఆనందంతో నిండిపోయింది. భాస్కరంమీద తను పెట్టుకున్న ఆశలు యీడేరాయనిపించింది. "ఇంకా ఆలోచించే దేముంది — వసంతకు కూడా యిష్టమేనని బోధపడుతోంది. ఏమ్మా వసంతా" అంటూ చాటునుంచి చూస్తున్న ఆమె వంక చూశారాయన.

"మీ యిష్టం" అంది వసంత ఆనందం గానే.

"శుభం. ఇంతకీ కోడలిపిల్ల నెప్పుడు చూపిస్తావోయ్!" అడిగింది భారతమ్మ కొడుకుని.

"మీ యిష్టమే" అంటూ లేచాడు భాస్కరం.

* * *

ఇంటిముందు ఆటో ఆగింది. ఆటో వెనుకే స్కూటర్ ఆపి లోపలికొచ్చాడు పండరికుమార్.

వస్తూనే గుమ్మంలోని వసంతనుచూశాడు. లేతగులాబీ పాలిస్టర్ చీరలో అందంగా మెరిసి



## కార్టూనిస్టులకు సూచనలు!

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి.

★ ప్రతి కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!

★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగావుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.

★ సొంత చిరునామా గల తపాలా బిళ్ళలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడంజరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.

★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనా ఐదారువారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్‌లు — బాగా ముందుగా వాటి కవరుమీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.

★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులంటించిన కవరు జతచేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

— సం॥

పోతోంది. ఆతడిని చూసి తుర్రుమని లోపలికి పోయింది వసంత.

"రావోయ్ రా!" అంటూ లేచారు రాఘవరావుగారు. గ్లాస్కోపంచ; పట్టు లాల్చీ ధరించారాయన. భారతమ్మగారు తమ పెళ్ళినాటి పట్టుచీరలో పెద్దరికం వుట్టిపడేలా నిండుగా తయారయ్యారు.

"ఇక ఆలస్యమేముంది పదండి" అంటూ అడుగుముందుకు వేశాడు భాస్కరం.

ఆటోలో రాఘవరావుగారూ, భారతమ్మగారూ వసంత కూర్చున్నారు. ఆ వెనుక స్కూటర్ మీద పండరికుమార్, భాస్కరం బయల్దేరారు.

మరో పావుగంటలో ఆటో ఓ చిన్న డాబా ముందు ఆగింది. ఆటోదిగి ఇంటివైపు చూశారు రాఘవరావుగారు. ముందు ఖాళీ జాగాలో పూల మొక్కలు, వెనుకగా చిన్నయిల్లు. ముచ్చటగా వుంది. లోపల్నించి వీణావాదనం హాయిగా విన్పిస్తోంది. పండరికుమార్ స్కూటర్ దిగి, గేటు తీసి వారి నాహ్వానించాడు.

గులాబి, మందారం, మల్లె, చామంతీ... మొక్కలను దాటి గుమ్మంలోకి అడుగుపెట్టిన

## సంగమం

రాఘవరావుగారి దృష్టి అపర సరస్వతీదేవిలా వీణ వాయిస్తున్న అమ్మాయిపైన పడింది. ఛాయ తక్కువే అయినా కళగావుండే ముఖం, పెద్ద కళ్ళూ. వీణవాయించడం ఆపి, లేచి నిల్చుందామె.

"మా చెల్లాయి వసుధ" పరిచయం చేశాడు పండరి.

గౌరవంగా తలొంచి చేతులు జోడించింది వసుధ.

"వీరు మా అమ్మగారు. ఈ యింట్లో వుండేది మేం ముగ్గురమే. నాన్నగారు పోయి మూడేళ్ళయింది" అన్నాడు పండరి తన తల్లిని పరిచయం చేస్తూ.

"మధ్యలో ఆపేశావేమమ్మా, ఓ చక్కని కృతి వాయించు" అన్నారు రాఘవరావుగారు కూర్చుంటూ.

కూర్చొని వీణను చేతిలోనికి తీసుకుంది వసుధ. "కోటినదులు ధనుష్కోటిలో నుండగా" త్యాగరాజస్వామి కృతి వీనులవిందు నలరిస్తోంది.

"చెల్లాయి ఇప్పటికి పాతిక కచ్చేరీల వరకూ యిచ్చింది" అన్నాడు పండరి. రాఘవరావుగారు సంగీతంలో పూర్తిగా లీనమయ్యాడు. ఫలహారం తీసుకుంటూ కూతురి అదృష్టానికి లోలోపలే మురిసిపోతోంది భారతమ్మ.

వీణపై వాద్యం పూర్తయ్యాక భారతమ్మ నోరు విప్పింది. "మాటల్ని కూడ తీగపై పలికించగల నేర్పుందమ్మా నీకు. ఒక్క పాట కూడ పాడావంటే..."

వసుధ లేచి నిల్చుంది. ఆమెకళ్లలో సుళ్లు తిరిగిన కన్నీళ్ళు.

"మీ కోడలు మాటల్ని తీగలమీదే పలికించ గలదమ్మా — గొంతులోంచి పలికించే భాగ్యం ఆ దేవుడియ్యలేదు". భాస్కరం మాటలకు అవాక్కయి చూశారు రాఘవరావుగారు. అంటే... అంటే...యిది భాస్కరం తన బరువును దించడానికి చేసిన త్యాగం కాదుకదా?

నిశ్శబ్దపవనంలో సంగీతం మిళితమైనట్లు ఉప్పనీటి జలధిలో పవిత్రజీవనదులు సంగమించినట్లు, యీ ఇరువురి సంగమం సహజ సిద్ధమైతే...అదే నిజమైతే...? రాఘవరావుగారి కళ్లలో నీళ్ళు చిలికాయి.

అవి...అవి...భాష్పాలే — ఆనందభాష్పాలే!!

★


# దరఖాస్తులు కోరబడుచున్నవి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే రిజిష్టరు చేయబడినది.

**ESTD. : 1979**

ఉద్యోగములు : 1. Clerks, 2. Cashiers, 3. Accountants, 4. Field Man 5. Field Asst., 6. Sugarcane Asst., 7. Field Mastry, 8. Sub Asst., 9. Craft Teachers,

అర్హతలు : 7th pass to S. S. C, Inter, Degree

జీతము : రు. 480/-ల నుండి రు. 720/-ల వరకు పొందవచ్చును.

పై విద్యార్హతలు గలవారు అగ్రికల్చరల్/అకౌంటెన్సీ కోర్సులందు రెగ్యులర్ / పోస్టుద్వారా శిక్షణ పొంది శిక్షణానంతరము జరుగు ప్రభుత్వ పరీక్షలందు ఉత్తీర్ణులయిన వారు పై ప్రభుత్వోద్యోగములలో నియమింపబడుటకు అర్హులు.

రెగ్యులర్ విద్యార్థులకు భోజనము, హాస్టలు వసతి కలదు. పోస్టుద్వారా శిక్షణ పొందువారికి ప్రతి వారము ప్రింటెడ్ పుస్తకములు పంపబడును.

పై ప్రభుత్వోద్యోగములు చేయగోరు స్త్రీ, పురుషులు నిర్ణీత దరఖాస్తు ఫారము, పూర్తి వివరములకు 12 రోజులలోగా రు. 5/-M.O. దిగువ అడ్రసుకు పంపి పొందవచ్చును.

**Principal,**

**S. N. A. T. TRAINING INSTITUTE,**

ADDANKI - 523 201. Prakasam (Dt.) A. P.



# తెల్ల మచ్చలకు చికిత్స



తీవ్రమైన ఒక పరిశోధన తరువాత తెల్ల మచ్చలను బాగు చేసేందుకుగాను మా మందు కనిపెట్టబడింది చికిత్సను నియమిత పూర్తిగా పొందుతే మచ్చల రంగు మారి శరీరానికి మునుపటి రంగు తిరిగి వస్తుంది. జబ్బు మొదళ్ళలో నుండి కూడా పూర్తిగా నయమౌతుంది. మీరు నిరాశ చెందినట్లయితే తప్పకుండా ఈ చికిత్సను పొందండి. మా చికిత్సను పూర్తిగా పొందినట్లయితే ప్రచారణకై ఒక ఫైల్ ఉచితంగా ఇవ్వబడుతుంది. రోగుల వయస్సుతో సహా జబ్బు పూర్తి వివరాలను వ్రాయండి.

# దాంపత్య జీవితాన్ని ఆనందించండి



బాల్యంలో చేసిన పొరపాట్లకు లేక మరి ఏ ఇతర కారణాలకు గాని లోనై సిగ్గుతో మీ బలహీనతను ప్రదర్శించలేక దాంపత్య జీవితంలో ఎటువంటి ఆనందభరితమైన సుఖాన్ని అనుభవించలేక పోతున్నారా...అయితే రహస్యమైన మీ జబ్బు యొక్క పూర్తి వివరాలను వ్రాయండి. దాంపత్య జీవితంలో గల నిజమైన సుఖాన్ని అనుభవించేందుకు సలహాలను పొందండి.

# తెల్ల వెంట్రుకలు మరియు వెంట్రుకలు రాలిపోవుట

జుట్టును డై చెయ్యనవసరం లేదు మా ఆయుర్వేద చికిత్స (ఆయిల్) వల్ల తెల్ల వెంట్రుకలు మామూలు నలుపు రంగులోనికి మారి స్థిరంగా నిలుస్తాయి. జుట్టు రాలిపోకుండా కాపాడి జుట్టు రాలిన ప్రదేశాన కొత్త జుట్టు వస్తుంది. ఇది మెదడును చల్ల పరుస్తుంది. ఒక కోర్సులో 3 ఫైల్స్ ధర రూ. 35/- పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

**SHYAM AYURVED BHAVAN (AP)**

***P.O. KATRI SARAI (GAYA) PIN : 805 105***